


గత పది సంవత్సరాలుగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది తెలుగువారిని అలరిస్తున్న కిరణ్ ప్రభ టాక్ షోలు, యు ట్యూబ్లో 800 పైగా ఉన్న విషయం కౌముది పాఠకులకు తెలుసనే అనుకుంటున్నాము. కొంతమంది పాఠకులు ఆ టాక్ షోలకు అక్షరరూపం ఇస్తే బాగుంటుందని అడుగుతున్నారు. వారి సూచనలమేరకు ఆ టాక్ షోల నుంచి ఎంపికచేసిన కొన్నింటిని నెలనెలా ఇలా అక్షరరూపంలో మీకందిస్తున్నాము.

# కార్ల్ మార్క్స్ సమగ్ర జీవిత చిత్రణ

## 7వ భాగం

వాళ్ళ అబ్బాయి ఎడ్గర్ మరణం నుండి ఆ ఇంట్లో వాళ్ళు తేరుకోవడం అంత తేలిగ్గా సాధ్యం కావడం లేదు. అంత వరకూ ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ముందుకు సాగుతున్న మార్క్స్ కూడా సర్వస్వం కోల్పోయిన వాడిలాగా అయిపోయాడు. ఆడపిల్లలిద్దరూ తమ్ముడ్ని పదేపదే గుర్తుకు తెచ్చుకుంటున్నారు. జెన్నీ ఎంతయినా తల్లి కదా! ఓ విధమైన డిప్రషన్ లోకి వెళ్ళిపోయింది. అప్పులూ, ఆర్థిక బాధలూ ఎలాగూ వదలడం లేదు. అటు వంటి పరిస్థితుల్లో జెన్నినీ, పిల్లల్నీ ఆ వాతావరణం నుండి కొద్ది రోజులైనా ఎక్కడికైనా తీసుకువెళితే బాగుండును అనుకున్నాడు మార్క్స్. అప్పుడే ఒక చిన్నపాటి మంచి వార్త తెలిసింది.

జెన్ని మేనమామ చనిపోతూ, రాసిన వీలునామాలో 150 పౌండ్లు జెన్నికి చెందేటట్లు రాశాడు. అయితే, అవి చేతికి రావడానికి 2,3, నెలలు పడుతుంది. యాదృచ్చికంగా మార్క్స్ మిత్రుడు ఒకతను ‘ పీటర్ ఇమాంట్ ‘అని జర్మనీలో ఉండగానే తెలుసు. అతను లండన్ వచ్చి, లండన్ లోనే స్థిరపడ్డాడు. అతనికి లండన్ కి కాస్త దూరం పల్లెటూరి

వాతావరణంలో 'కేంపర్ వెల్ 'అని ఒక వూరు వుంది. అక్కడ ఆయనకు ఒక గెస్ట్ హౌస్ వుంది. మార్క్స్ ఇలా కొడుకు చనిపోయిన విషాదం లో వున్న రోజుల్లోనే, ఆయన లండన్ నుండి స్విట్జర్లండ్ వెళుతూ..

" నాకు కేంపర్ వెల్ లో గెస్ట్ హౌస్ వుంది. కొన్ని రోజుల పాటు అక్కడ వుండండి. ఈ వాతావరణం నుండి దూరంగా వుంటే మీకు కాస్త బాగుంటుంది "అన్నాడు. మార్క్స్ కూడా వాతావరణం మార్పు కోసమే చూస్తున్నాడు కదా! అందుకని భార్యా, పిల్లల్ని వెంటబెట్టుకొని ఆ కేంపర్ వెల్ లోని గెస్ట్ హౌస్ కి వెళ్ళాడు. కాస్త కొత్త వాతావరణం ఆ చిన్న పాప 'ఎలినార్ ' తో ఆడుకుంటూ నెమ్మది నెమ్మదిగా ఎడ్గర్ ఎడబాటుని మరచిపోయే ప్రయత్నం చేస్తున్నారు మార్క్స్, జెన్నీలు.

అక్కడ ఉండగానే మార్క్స్ ని వెతుక్కుంటూ లండన్ నుండిఆ 'కేంపర్ వెల్ ' ఒకాయన వచ్చాడు. ఆయన ఎవరంటే, నెలరోజుల క్రిందట 'ఎడ్గర్ కి వైద్యం చేసిన మనిషి. ఆయన ఎందుకు వచ్చాడంటే,

"వైద్యం తాలుకా ఫీజూ, మందుల ఖర్చూ ఇవ్వలేదు. అవి వసూలు చేసుకొని రమ్మనమని డాక్టర్ గారు నన్ను పంపించారు " అన్నాడు. మార్క్స్ దగ్గర డబ్బులు లేవు. ఎప్పుడో జెన్ని కి వాళ్ళ మేనమామ దగ్గర నుండి వచ్చే 15o పౌండ్ల కోసం ఎదురు చూస్తున్నారు. అది వస్తే, డాక్టర్ గారి బాకీ తీర్చేద్దామని మార్క్స్ ఆలోచన. అదేమో ఇంకా రాలేదు.

అందుకని ఆ వచ్చిన మనిషికి " తొందరలోనే మేము లండన్ వచ్చేస్తాం.వచ్చి, రాగానే డాక్టర్ గారి బాకీ తీర్చేస్తాం. "అని అప్పటికి ఏదో సర్ది చెప్పి పంపించేశారు. అయితే, ఆ మనిషి మళ్ళీ వస్తాడేమోనని ఏం చేసాడంటే.. భార్యా, పిల్లల్ని కెంప్ బెల్ లోని గెస్ట్ హౌస్ లో ఉంచేసి,తను ఒక్కడే లండన్ వెళ్ళి, అక్కడ తన ఇంట్లో తలుపులు వేసేసుకొని కొన్ని వారాలు గడిపాడు. చివరకు జెన్నికి రావలిసిన డబ్బులు వచ్చాయని తెలిశాక అప్పుడు భార్యా, పిల్లల్ని వెనక్కి రమ్మనమని, ఆ డాక్టర్ బాకీ తీర్చేసాడు. నిజానికి ఇలా అప్పుల మీద అప్పులు పెరగకుండా ఉంటే, వాళ్లకి వచ్చిన 150 పౌండ్ల వలన ఆ సంవత్సరం చివరి వరకూ ఇబ్బంది లేకుండా సరిపోతుంది. ఇలాంటి అప్పులూ, బాధలూ మార్క్సను యేవో కొన్నాళ్ళు కాదు, దశాబ్దాల పాటు వెంటాడుతూనే వున్నాయి.

ఆ మిగిలిన డబ్బులతోటి కొంచెం వెసులుబాటు వచ్చేసరికి, అప్పటికి చాలా కాలంగా రాయడం మానేసిన ఆ 'పొలిటికల్ ఎకానమీ 'వ్యాసాలు రాయడానికి మళ్ళీ పూనుకున్నాడు. ఆయన ఇన్ని ఇబ్బందుల్లో వుండగా 'న్యూయార్క్ టైమ్స్ ' కి రాయాల్సిన వ్యాసాలు ఎంగెల్సే రాస్తుండేవాడు గతంలో. వాటిని తీసుకొని తనే రాయడం ప్రారంభించాడు. ఈ విధంగా ఒక సంవత్సరం పాటు గడచింది. అంతలో 1856 మే లో జెన్నీ వాళ్ళ అమ్మకు ఆరోగ్యం బాగాలేదనే కబురు వచ్చింది.

పిల్లల్నీ, హెలెన్నీ తీసుకొని తన సొంత ఊరైన ట్రియర్ కి బయలుదేరింది జెన్నీ. మార్క్స్ ఒక్కడే లండన్ లో ఉండిపోయాడు. ఒక్కడే వుంటే, వ్యాసాలు చాలా తొందరగా పూర్తి చేయవచ్చు అనుకున్నాడు. కానీ, నిజానికి భార్యా,

పిల్లలు దగ్గర లేనిదే ఏమీ చెయ్యలేని పరిస్థితి ఆయనది. ఇంట్లో ఎన్ని ఇబ్బందులూ, సమస్యలూ ఉన్నప్పటికీ, చుట్టూ యెంత గందరగోళంగా ఉన్నప్పుడే మార్క్స్ ఎక్కువగా రాసుకుండేవాడు. ఈ విషయాలన్నీ మార్క్స్, జెన్ని కి రాసిన ఉత్తరాల్లో స్పష్టంగా రాశాడు. అందుకని వాళ్ళు లేనపుడు కూడా అతను రాసే వేగం పెరగలేదు.

జెన్ని వెళ్ళిన రెండు నెలలకి 1856 జూలై 23న వాళ్ళ అమ్మగారు చనిపోయారు. తల్లి రాసిన వీలునామాలో జెన్నికి కొంత డబ్బూ, మరికొంత స్టాక్సు రూపంలో కూడా కొన్ని ఇచ్చింది. ఈ వ్యవహారాలన్నీ కూడా జెన్ని అన్నయ్య చెయ్యాలి.

ఆయన చెప్పాడు "స్టాక్సు అయితే వున్నాయి. కానీ, వాటిని ఇప్పుడు అమ్మితే చాలా నష్టం వస్తుంది. తర్వాత అమ్ముదాం. నీకు రావలిసిన డబ్బులు బ్యాంకు వాళ్ళతో మాట్లాడి, తరువాత పంపిస్తాను."అని చెప్పాడు. ఆ డబ్బులు వస్తాయి కదని వెనక్కి వచ్చేసింది. జెన్ని వెనక్కి వస్తూ,వస్తూ వాళ్ళ వెంట మరొక వ్యక్తిని కూడా తీసుకువచ్చింది. ఆమె ఎవరంటే, పనిమనిషి హెలెన్ చెల్లెలు. 'మారియానా' ఆమె పేరు.

ఆమెను వెంట తీసుకురావడానికి కారణం ఏమిటంటే... గత కొన్నాళ్ళుగా జెన్ని వాళ్ళ అమ్మని హెలెన్ చెల్లెలు 'మరియానా'యే ఇంట్లో సహాయకురాలిగా ఉంటూ చూసుకునేది. మరి ఆమె చనిపోయిన తర్వాత ఎక్కడ వుంచడానికీ వీలులేక జెన్నీ తీసుకువెళ్ళింది. అంటే, ఇప్పుడు మార్క్స్ వాళ్ళ ఇంట్లో – నలుగురు పెద్దవాళ్ళూ, ముగ్గురు పిల్లలు. మొత్తం ఏడుగురు అయ్యారు. అయితే, ఈసారి లండన్ రావడానికి 2 నెలల ముందే జెన్ని చెప్పింది మార్క్సుకి.

"మనం ఇంక ఆ 'సోహో' ప్రాంతంలో ఉండలేము. అక్కడ వుంటే చనిపోయిన పిల్లల జ్ఞాపకాలే చుట్టు ముడుతున్నాయి. ఎక్కడైనా మరో కొత్త ఇల్లు చూడండి.అమ్మ దగ్గర నుండి రావాల్సిన డబ్బులు వున్నాయి కదా! మంచి ఇంట్లోకి మారదాం."అని.

అందుకని జెన్నీ, పిల్లలూ లండన్ వచ్చేసరికి మార్క్స్ కొత్త ఇల్లు చూసి ఉంచాడు. ఈ కొత్త ఇల్లు ప్రస్తుతం వాళ్ళు ఉంటున్న 'సోహో' ప్రాంతానికి 3,4, మైళ్ళ దూరంలో వుంది. ఆ ప్రాంతం పేరు 'హేంప్ స్టడ్ హీత్'.అది నార్త్ లండన్ లో వుంది.అందులో 'కేంటిస్టవున్'అని ఒక మరి చిన్నపట్టణం లేదా చిన్న ప్రాంతం అనుకోవచ్చు. ఈ 'కేంటి స్టవున్' లో ఇంటి నంబర్ '9 గ్రాఫ్ టెర్రస్' అనే ఇంటిని అద్దెకు మాట్లాడాడు. ఇంత వివరంగా ఎందుకు చెప్తున్నానంటే, ఆ తరువాత మరో 8 ఏళ్ళ పాటు మార్క్స్ కుటుంబం ఆ ఇంట్లోనే వుంది. లండన్ లో ఆ ఇల్లు ఇప్పటికీ అలాగే వుంది. కాకపోతే ఈ 17o ఏళ్ళలో రకరకాల మార్పులతో ఆ ఇంటి నంబర్ 9 బదులు 46 అయ్యింది. ఆ వీధి మాత్రం అలాగే వుంది. ఎప్పుడైనా మీరు లండన్ వెళితే, 46 గ్రాఫ్ టెర్రస్, కేంటి స్టవున్'అని గూగుల్ మేప్ లో చూస్తె, సరాసరి ఆ ఇంటికి అప్పట్లో మార్క్స్ 8 ఏళ్ళ పాటు నివసించిన ఇల్లుని అదే రూపంలో ఇప్పుడు కూడా చూడవచ్చు.

వీళ్ళ కుటుంబం అక్కడకు మారేసరికి ఆ పరిసరాలు పూర్తిగా అభివృద్ధి చెందలేదు. ఇంకా ఆ చుట్టుపక్కల ఇళ్ళు కడుతూనే వున్నారు. మార్క్స్ అద్దెకు తీసుకున్న 3 అంతస్తుల ఇల్లు. పాత ఇంటి కంటే బాగా పెద్దది. 8 గదులు వున్నాయి. అద్దె కూడా ఎక్కువే.36 పౌండ్లు. జెన్నికి వారసత్వంగా డబ్బు భారీగా వుంటుంది అనుకొని అంత పెద్ద ఇల్లు అద్దెకు తీసుకున్నారు. మరో నెల రోజులకి జెన్నీకి రావలసిన డబ్బు వచ్చింది. అది 96 పౌండ్ల 6 షిల్లింగులు మాత్రమే. కనీసం 2,3, వందలు అయినా వస్తుంది అనుకున్నారు. స్టాక్సు అమ్మే డబ్బు ఎప్పుడు వస్తుందో తెలియదు.

వచ్చిన డబ్బుతో ముందు ఆ ఇంటికి అడ్వాన్సు కట్టి, మిగిలిన డబ్బులతో ఇంట్లోకి కావలసిన సామాన్లు కొన్నారు. అవి కూడా సెకెండ్ హ్యాండ్ సామాన్లు అమ్మే షాపు లో కొనుకున్నారు. ఇలా ఏదో ఒకరకంగా స్థిర పడదామని అనుకున్న సమయంలో మళ్ళీ సమస్యలు. మార్క్స్ జీవిత చక్రం అలా తిరుగుతూనే వుంది. ఈసారి ఏమయిందంటే, జెన్నీ 7వ సారి గర్భవతి అని తెలిసింది. వచ్చిన డబ్బులు కొత్త ఇంట్లో సర్దుకోవడానికి సరిపోయాయి. పైగా ఇంట్లో హెలెన్ చెల్లెలు కొత్త సభ్యురాలు కూడా వుంది. వీటన్నిటికీ తోడు జెన్ని కి మళ్ళీ మందులూ, డాక్టర్లూ ఈ ఇబ్బందులు కూడా పెరిగాయి. ఆడ పిల్లలేమో పెద్దవాళ్ళవుతున్నారు. వాళ్లకు పేదరికం అంటే ఏమిటో తెలుస్తున్నది ఇప్పుడిప్పుడే. స్కూలుకి వెళ్ళినపుడూ, మిగతా పిల్లల్ని చూసినపుడూ ఆ తేడా బాగా అర్ధమయ్యేది.

అయినా వాళ్ళు నాన్న పరిస్థితి అర్ధం చేసుకోవడమే తప్ప, ఎప్పుడూ అది కావాలీ, ఇది కావాలి అని ఇబ్బంది పెట్టేవారు కాదు. పెద్దమ్మాయి జెన్ని చెన్ [మార్క్స్ భార్య పేరు జెన్నీ,పెద్దమ్మాయి పేరు జెన్నీ చెన్.ఈ రెండు పేర్లు గందరగోళంగా వుంటాయి.అందుకని, ఇకపై జెన్నీ పేరు తీసేసి ఉత్తి చెన్ అందాం] అయితే వాళ్ళ అమ్మా, నాన్నలకు ఎలా సహాయం చేయాలా అని ఆలోచించి, ఇంట్లో ఆ పనీ, ఈ చేస్తానంటుంటే, "ముందు బాగా చదువుకో!ఇంట్లో పనులన్నీ మేం చేసుకుంటాంలే " అని సర్ది చెప్పేది తల్లి.

ఈలోగా అమెరికా న్యూస్ పేపర్ వాళ్ళు "మీరు వారానికి ఒకటి, రెండు వ్యాసాలు రాస్తున్నారు కదా, కుదించేసి వారానికి ఒక వ్యాసమే తీసుకుంటాం "అన్నారు. దాంతో వారానికి రెండు పౌండ్లు వచ్చే ఆదాయం ఒక పౌండ్ కి పడిపోయింది. ఇవన్ని ఎంగెల్సుకు తెలిశాయి. అతను మాంచెస్టర్ లో ఫ్యాక్టరీ చూసుకుంటున్నాడు కదా! అతను ఏమన్నాడంటే " నేను నెలకు 5 పౌండ్లు పంపిస్తాను. ఇంకా అవసరం అయితే అడుగు. మొహమాట పడకు."అని. ఇలా ఎంగెల్సు ఒక పక్క సహాయం చేస్తుండేవాడు. అయినా గానీ, మార్క్సుకి అప్పులూ, బాధలూ మామూలు అయిపోయాయి.

1857 జూలై 7 న జెన్నికి ఏడవ సంతానం మరొక మగబిడ్డ పుట్టాడు. కానీ, ఈసారి అత్యంత విషాదం ఏమిటంటే..ఆ పసిబిడ్డ పుట్టిన వెంటనే చనిపోయాడు. గత విషాదాలతో పోలిస్తే, ఈ విషాదం తక్కువ విషాదమే అనుకోవచ్చు. ఎలా అయినా కడుపున పుట్టిన బిడ్డ చనిపోవడం అంటే విషాదమే. పైగా తల్లి జెన్నికి మరింత బాధ. ఆమె మరింత ఎక్కువగా డిప్రషన్ కి లోనయ్యింది.

మొత్తంగా చూస్తే, మార్క్స్, జెన్నిల 7 గురు  సంతానం లోనూ ముగ్గురు పసి వయసులోనే మరణిస్తే, 8 ఏళ్ళ వయసులో ఎడ్గర్ మరణించాడు. ఇక మిగిలింది ముగ్గురు. ఈ ముగ్గురే తరవాత రోజుల్లో బ్రతికి బట్టకట్టారు. ఈ చిట్టచివరి బిడ్డ చనిపోవడంతో గత 5, 6 గా మార్క్స్ కుటుంబంలో కరాళ నృత్యం చేసిన మృత్యుదేవత కొన్నాళ్ల పాటు తాత్కాలికంగా శెలవు తీసుకుంది.

తగ్గిన ఆదాయం, ఎప్పటినుండో పెరుగుతున్న అప్పులూ, వీటన్నిటి తోనూ తప్పనిసరి గా ఏదైనా అదనంగా సంపాదించాల్సిన పరిస్థితి. ఇక మరో ప్రత్యామ్నాయం ఎప్పటినుండో ఆపుతూ వస్తున్న ఆ 'పొలిటికల్ ఎకానమీ' అనే పుస్తకాన్ని పూర్తి చేసి, ప్రచురణ కర్తలకు ఇస్తే, వాళ్ళ దగ్గర నుండి ఏమైనా డబ్బులు వస్తాయని పించింది మార్క్స్ కి. 1857 చివరికి జర్మనీ లో మార్క్స్ పుస్తకాలు వచ్చి, పదేళ్ళు అవుతోంది. ఎందుకంటే, ఆయన రాయబోయే పుస్తకం,రాస్తున్న పుస్తకం కూడా జర్మనీ బాష లోనే. మరి ఇప్పుడు ఆయన రాసేటటువంటి పుస్తకాన్ని జర్మనీ లో రాస్తే, ఎవరైనా కొంటారా? అసలు అచ్చు వేయడానికి ఎవరైనా ముందుకు వస్తారా?ఈ రకమైన ఆలోచనలతో ...ఆయనకు బాగా తెలిసిన మిత్రుల ద్వారా జర్మనీలోని పబ్లిషర్స్ ని వెతకడం ప్రారంభించాడు. చివరకు ఒకాయన దొరికాడు.

"మార్క్స్ రాసినటువంటి వ్యాసాల్ని నేను వేస్తాను."అన్నాడు. .

"ఆయన విడతలువారిగా ఇస్తాడు. అంటే, ఇన్ స్టాల్ మెంట్స్ లాగా ఇస్తాడు. మొదటి విడత వ్యాసం ఉచితంగా ఇస్తాడు "అని చెప్పాడు మార్క్స్ మిత్రుడు.

దానికి పబ్లిషర్ "అలా వద్దండి దానికి నేను పారితోషికం ఇస్తాను. అంతే కాదు  బెర్లిన్ యునివర్సిటీ ప్రొఫెసర్లకి మేము ఇచ్చేదాని కన్నా ఎక్కువ ఇస్తాను. కాకపోతే, మొదట రెండు విడతల వ్యాసాలు ఇవ్వాలి. " అన్నాడు. ఈ విషయాన్ని జర్మనీ మిత్రుడు మార్క్స్ కి చెప్పాడు. "సరే!"నని ఒప్పుకున్నాడు మార్క్స్.ఇది జరిగింది 1858 జనవరి లో. 1858 ఏప్రిల్ కల్లా మొట్ట మొదటి వ్యాసాలు ఇవ్వాలి. అయితే, మార్క్స్ రాసే విధానం ఎంగెల్సు, జెన్నీలకు బాగా తెలుసు. అందుకని వాళ్ళు కంగారు పడ్డారు. పెద్దాయన ఒప్పుకోవడం అయితే, ఒప్పేసుకున్నాడు. గానీ, సమయానికి ఇచ్చేటటు వంటి  ఆనవాయితీ లేనేలేదు. పైగా ఒకరికి ఇవ్వాలి. సమయానికి ఇవ్వాలి. అవి ఇస్తే, నాకు డబ్బులు వస్తాయి. ఇన్ని నిబంధనలతో ఆ రాసేది పూర్తి చేయడానికి, తనని తాను హింసించుకుంటాడని వాళ్ళిద్దరూ చాలా కంగారు పడ్డారు.

వాళ్ళు అనుకున్నారు గానీ, ఆయనయెంత పూర్తి చేద్దామని ప్రయత్నించిప్పటికీ అతని వల్ల కాలేదు. ఏప్రిల్ లో ఇవ్వాల్సింది. మే, జూన్, జూలై ఇలా 5,6 నెలలు అయినా గానీ, అది ఒక కొలిక్కి రాలేదు. మధ్యలో ఒకసారి అప్పుల బాధ భరించలేక 'సెంట్రల్ లండన్' లో ఎక్కువ హామీ లేకుండా అప్పులు ఇస్తున్నారని, ఒక మిత్రుడ్ని తీసుకొని 'సెంట్రల్ లండన్' వెళ్ళాడు. అక్కడ వాళ్ళు ఏమన్నారంటే "రెండు పౌండ్లు పెట్టి, అప్లికేషన్ కొనుక్కొని క్యూ లో నిలుచోండి .మేం పరిశీలించి చెబుతాం "అన్నారు. ఆ మిత్రుడి దగ్గరే రెండు పౌండ్లు అప్పుచేసి, అప్లికేషన్ పూర్తి చేసి, క్యూ లో నిలుచున్నాడు.

ఆయన దగ్గరకు వచ్చిన తర్వాత అప్లికేషన్ పరిశీలించి "అబ్బే! నీ గత చరిత్ర ఏమీ బాగాలేదు. నీకు మేమే కాదు. ఎవ్వరూ అప్పులు ఇవ్వరు."అని మొండి చెయ్యి చూపించారు. దాంతో మరో రెండు పౌండ్లు అప్పు పెరగడం తప్ప, వెళ్ళిన పని పూర్తి కాలేదు. మళ్ళీ మామూలే.

ఎంగెల్సుకి ఈ విషయం తెలియదు. ఆయన మాత్రం డబ్బులు పంపించడం జరుగుతున్నది. ఎంగెల్సు, మార్క్సుకి వుత్తరం రాసాడు "ముందుగా పుస్తకం పూర్తి చెయ్యి. అప్పుల కోసమని ఊర్ల మీద తిరగవద్దు. అవసరం అయితే, నాకు రాస్తూ వుండు."అని. అప్పుడే ఈ బెర్లిన్ పబ్లిషర్ నుండి ఒత్తిడి పెరిగింది. "ఫలానా సమయం దాటితే, నీకూ, నీ పుస్తకానికీ ఒక దండం. ఆ లోగా ఇస్తే, ఇవ్వండి. లేకపోతే లేదు."అని చెప్పేశారు. అంత ఒత్తిడి తోటీ, అంత ఆలస్యం తోటీ 1859 జనవరి చివరికి 192 పేజీల రాత ప్రతిని, భార్య జెన్నీ ఫెయిర్ చేశాక, ఆ జర్మన్ పబ్లిషర్ కి పంపించాడు. ఆ వ్యాససంపుటి యొక్క పేరు "ఎ కాంట్రిబ్యూషన్ క్రిటిక్ పొలిటికల్ ఎకానమీ "అని పేరు పెట్టాడు.ఇంత వివరంగా ఈ పుస్తకం గురించి ఎందుకు అనుకోవాలి అంటే..ఆ తరువాత 8 సంవత్సరాలకి మార్క్సు రాసిన అద్భుత గ్రంధం "కేపిటల్ "పుస్తకం లో ఈ పుస్తకం ఒక భాగం అయింది.

ఒక్కసారి మీరు ఎప్పుడైనా ఆ 'కేపిటల్' చదువుతుంటే..ఇన్ని ఈతి బాధల్లో వుండి కూడా ఇంత లోతుగా సమాజాన్ని విశ్లేషించి, అధ్యయనం చేసి, శతాబ్దాలు దాటినా నిలబడేలా రాసింది ఈ కార్ల్ మార్క్సేనా ఆశ్చర్యపడక తప్పదు. 'ఇంక బెర్లిన్ లో పబ్లిషర్ ప్రచురించడమే మిగిలివుంది. ఆయన ప్రచురించగానే మార్కెట్లో విపరీతంగా అమ్ముడుపోతుంది. ఆశించిన దానికన్నా ఎక్కువ ఆదాయం వస్తుంది' అని ఎదురు చూడడం మొదలుపెట్టాడు మార్క్సు. మార్క్సు విషయంలో ఏదీ సవ్యంగా జరగదు కదా!

ఆ పబ్లిషర్ అదిగో, ఇదిగో అంటూ పుస్తకం పబ్లిష్ చేయడం వాయిదా వేస్తూ వచ్చాడు. మరి అతనికి వున్న సమస్యలు ఏమిటో తెలియదు గానీ, ఆ పబ్లిషర్ వెనకాల పడడం మార్క్సు పని అయింది. చివరకు "నా పుస్తకం నాకు ఇచ్చేయ్!" అనే వరకూ వెళ్ళాడు. ఎలాగో ఒకలాగా 1859 జూన్ నాటికి ఆ పుస్తకానికి మార్కెట్ లోనికి తెచ్చాడు ఆ పబ్లిషర్ జర్మనీ లో అయితే, మార్క్సు, ఎంగెల్సు లు ఊహించినట్లుగా ఆ పుస్తకానికి విపరీతమైన స్పందన ఏమీ రాలేదు. అసలు విమర్శకులు ఎవరూ పట్టించుకోలేదు. " అస్సలు కాపీలు అమ్ముడవ్వడంలేదు "అన్నాడు పబ్లిషర్.

ఈ విషయం తెలిసిన మార్క్సు వ్యతిరేకులు వున్నారు కదా! వారు మార్క్సుని అవహేళన చేస్తూ పత్రికల్లో వ్యాసాలు రాయడం ప్రారంభించారు. పుండు మీద కారం జల్లినట్లుగా వుంది మార్క్సుకి. అలాంటి పరిస్థితిలో ప్రత్యర్థులను ఎదుర్కోవాలంటే, ఒక ఆయుధం కావాలి.

సరిగ్గా అప్పుడే ఆయన మిత్రుడు ఒకతను "ఒక పత్రికను ప్రారంభిద్దాము" అన్నాడు. మార్క్సుకి ఒక దారి దొరికినట్లయింది."సరే!"అన్నాడు. దానికి మార్క్సే ఎడిటర్. ఎడిటర్ అంటే, ఆ రోజుల్లో పత్రిక చేసే అప్పులకు కూడా అతనిదే బాధ్యత. ఆ పత్రిక కూడా 3,4, నెలల్లో మూతపడింది. మార్క్సు అప్పుల జాబితా మరో 12 పౌండ్లు పెరిగింది.

ఇది ఇలా వుండగా అక్కడ ఎంగెల్సుకి 'మాంచెస్టర్' లో ఒక సంఘటన జరిగింది. ఏదో ఒక మద్యం పార్టీలో, ఒక ఆంగ్లేయుడితో గొడవ పడి, ఎంగెల్సు తన చేతిలో వున్న గొడుగుతో అతన్ని చితక్కొట్టాడు. దాంతో ఆ ఆంగ్లేయుడు 200 పౌండ్లకి కోర్టులో దావా వేశాడు. ఇదంతా ఎంగెల్సు వాళ్ళ నాన్నకు తెలిసి అగ్గిమీద గుగ్గిలం అయిపోయాడు. ఈ గొడవల కారణంగా ఎంగెల్సు నుండి మార్క్సు కి రావలసిన సహాయం ఆగిపోయింది. మార్క్సు గురించి మాట్లాడిన ప్రతిసారీ, ఎంగెల్సు ని గురించి కూడా అనుకోవాలి. ఎందుకంటే, మార్క్సు యొక్క సంక్షేమం అంతా ఎంగెల్సు పంపిన డబ్బుల మీదా, అతను ఇచ్చిన ప్రోత్సాహం, ప్రోద్బలం మీదే ఆధారపడి వుంది. అందుకని ఎంగెల్సు కి అక్కడ ఏం జరిగినా ఇక్కడ దాని ప్రభావం మార్క్సు మీద పడుతుంది.

ఆ రోజుల్లోనే మార్క్సు కి అప్పులు ఇచ్చిన వాళ్ళు, మార్క్సు మీద కోర్టులో కేసు వేశారు. ఆ సందర్భంలో జెన్ని కూడా కోర్టుకి వెళ్లి బోనులో నిలబడి, సాక్ష్యాలూ, సంజాయిషీలూ చెప్పుకోవాల్సి వచ్చింది. పిల్లలు పెరిగి పెద్దవాళ్ళవుతున్నారు. వాళ్లకి తల్లిదండ్రుల బాధలు బాగానే అర్ధమవుతున్నాయి. కాకపోతే, 'తండ్రి చాలా మేధావి. ఎప్పటికైనా సరే! ఆయన రాసిన సిద్దంతాలు ప్రపంచ గుర్తింపు పొందుతాయి' అని పిల్లలు కూడా నమ్మారు. అంతే కాకుండా పెద్దమ్మాయి 'చెన్', వాళ్ళ నాన్న రాసే వ్యాసాలు ఫెయిర్ చెయ్యడం నేర్చుకుంది. అంటే, వాళ్ళ అమ్మకు కాస్త విశ్రాంతిని ఇద్దాం అనే ఆలోచన. 'మొదటి పుస్తకం మార్కెట్ లో ఫెయిల్ అయినా గానీ, దాని కొనసాగింపుగా రాసిన రెండో పుస్తకం మార్కెట్ లోకి వస్తే, తప్పకుండా పేరు వస్తుంది' అని మార్క్సు, ఎంగెల్సుల గట్టి నమ్మకం.

సరిగ్గా ఆ రోజుల్లోనే "చార్లెస్ డార్విన్ " రాసిన "ఆరిజన్ ఆఫ్ స్పీషిస్"అనే పుస్తకం 1859 నవంబర్ 22 న మార్కెట్ లోకి వచ్చి, మొత్తం ప్రపంచాన్ని ఒక కుదుపు కుదిపేసింది. అప్పటి వరకూ చార్లెస్ డార్విన్ ఎక్కువ మందికి తెలియకపోయినా, ఆ ఒక్క పుస్తకం తోటి ప్రపంచం మొత్తం అతని పేరు తెలిసిపోయింది.

అదే విధంగా తన భర్త పుస్తకం కూడా ఏదో ఒకరోజు అంత పేరు తెచ్చుకుంటుందని జెన్నీ కి గట్టి నమ్మకం. అలా గడచిపోయింది 1859. అంటే మార్క్సు కుటుంబం లండన్ వచ్చి పదేళ్ళు అయ్యింది. ఆ తర్వాతి సంవత్సరం 1860 లో ఎంగెల్సు వాళ్ళ నాన్న చనిపోయాడు. కాబట్టి, ఫేక్టరీ వ్యవహారాలన్నీ ఎంగెల్సు అధీనం లోకి వచ్చాయి. డబ్బుల విషయంలో కూడా ఎంగెల్సు కు స్వాతంత్రం వచ్చింది. అందుకని మార్క్సుకి వంద పౌండ్లు పంపించాడు. మార్క్సు కుటుంబంలో కాస్త అప్పు తీరడం 4 రోజులు సంతోషకరమైన వాతావరణం.మార్క్సు కుటుంబంలో సంతోషం అనేది వుండేది. కానీ, ఎక్కువ కాలం నిలిచేది కాదు. విషాదం మాత్రం ఎప్పుడూ వెంటాడేది.

సరిగ్గా ఎంగెల్సు వంద పౌండ్లు పంపించాడనే సంతోషం లో ఉండగానే,1860 చివరలో మరొక విషాదం మార్క్స్ ఇంట్లో.1860 అక్టోబర్ లో జెన్నీకి మశూచి వ్యాధి వచ్చింది.ముందు అది మశూచి అని తెలియలేదు. ఏదో జ్వరం అనుకున్నారు. అది తగ్గడం లేదు. వైద్యుల్ని తీసుకు వచ్చారు. ఆ డాక్టర్ గారు పరిశీలించి..

"ఇదేదో అంటు వ్యాధి అని అనుమానంగా వుంది. ముందు పిల్లల్ని ఎక్కడికైనా దూరంగా పంపించేసెయ్యండి." ఆ ముగ్గురు పిల్లల్ని కూడా అక్కడకు దూరంగా తెలిసినవాళ్ళుంటే, పంపించాడు. ఒకవారం రోజుల్లోనే తెలిసింది జెన్నీకి వచ్చింది మశూచి అని. అప్పట్లో మశూచి వ్యాధితో లండన్ లో వందలాది మంది చనిపోయారు. ఆ చుట్టుపక్కల కూడా చాలామంది చనిపోయారు. ఆ రోజుల్లో ఆ వ్యాధికి పటిష్టమైన మందులు ఏవీ రాలేదు. మార్క్స్ మాత్రం ఇంట్లోనే వుండి, తనే భార్యకు సేవ చేసుండేవాడు. చనిపోయిన కొడుకు ఎడ్గర్ ని ఎలాగైతే చూసుకున్నాడో, భార్యని కూడా అంతే శ్రద్ధగా చూసుకున్నాడు. ఇక, హెలెన్, ఆమె చెల్లెలూ ఇంట్లో పనులు చూసుకుండేవారు.

జెన్నీకి వచ్చిన మశూచి వ్యాధి, తీవ్రస్థాయి చేరుకొని ఒళ్ళంతా మంటలుగా వుండేది. చల్లగాలి కోసమని కిటికీ తలుపులు తెరచి, అక్కడ కూర్చోబెట్టేవారు. అక్కడ వున్న పిల్లలేమో అమ్మని చూస్తామని గొడవ చేస్తుండేవారు. అందుకని వాళ్ళని తీసుకువచ్చి, రోడ్డు మీద నిలుచోబెట్టి, పై అంతస్తులో వున్న కిటికీ దగ్గర జెన్నీని కూర్చోబెట్టి "అదిగో అమ్మ" అని చూపించేవారు. అలా దాదాపుగా 3 నెలల పాటు మశూచి వ్యాధి జెన్నీ ని బాధించింది. అది వెళుతూ..వెళుతూ..తీసుకు వెళ్ళినదేమిటంటే..జెన్నీ రూపం. వ్యాధి పూర్తిగా తగ్గిన తరువాత, జెన్నీ ఒకసారి తన ముఖాన్ని అద్దంలో చూసుకొని ఒక్కసారి కెవ్వుమని కేక వేసిందట. అంత అందవికారంగా మారిపోయిందట ఆమె రూపం.

ట్రయర్ లో అద్భుత సౌందర్య రాశి జెన్నీ. ఆమె వూర్లో అలా నడచి వెళుతుంటేఅందరూ కూడా నిశ్రేష్టులై చూస్తూ ఉండిపోయేవారట. అలాంటి మనిషి ఇన్ని బాధలతోటీ, ఏడు కాన్పుల తోటి, ఇప్పుడు ఈ మశూచి వ్యాధి తోటి ఆమె ఆకారం పూర్తిగా మారిపోయింది. 3 నెలల తర్వాత అమ్మకు మశూచి తగ్గిందని పిల్లలు ఇంటికి వచ్చారు. లోనికి వచ్చి తల్లి ని చూసి ఒక్కసారిగా ఏడ్చారట. అంతగా గుర్తు పట్టలేని విధంగా మారిపోయింది జెన్నీ. ఇది ఒకటే కాదు. ఈ మశూచి వదలి వెళ్ళిన ప్రభావం వలన వినికిడి సమస్య కూడా వచ్చింది తరువాత రోజుల్లో.

1861 జనవరి వచ్చింది. జెన్ని అనారోగ్యంతో మళ్ళీ మామూలే. డాక్టర్ బిల్లులూ, మందులూ వాటికోసం అప్పులు చెయ్యడం. ఉన్న దాంట్లోనే కొంత తీర్చడం. ఇది ఇలా వుంటే ,అమెరికా లోని న్యూస్ పేపర్ వాళ్ళు మార్క్స్ కి కబురు చేసారు."నీకు పొరపాటున నువ్వు రాయనటు వంటి వ్యాసాలకి 19 వారాలకి ఎక్కువ పారితోషికం ఇచ్చేసాము.అప్పుడు మేము చూసుకోలేదు. తరువాత లెక్కలు చూసుకుంటేమా పొరపాటు తెలిసింది. కాబట్టి, మరో 4నెలల పాటు నీకు పారితోషికం రాదు. నువ్వు మాత్రం ఎప్పటి లాగే వ్యాసాలు రాస్తూ "అని రాశారు. దానికి తోడు వాళ్ళు ఏమన్నారంటే,

గతంలో మార్క్సు, ఎంగెల్సు కలసి ఒక 'ఎన్ సైక్లోపీడియా' ప్రాజెక్ట్ ఒకటి ఇచ్చారు. "అది కూడా ఆపేస్తున్నాము. అమెరికాలో సివిల్ వార్ మొదలయ్యింది. అందుకని దాని తాలుకా డబ్బులు కూడా ఇవ్వలేము "అని చెప్పేశారు.

మళ్ళీ ఒక్కసారిగా బుసలు కొట్టే అప్పులు కనిపించాయి, వాటి నుండి తప్పించుకోవడానికి మార్గం ఏమిటి? అని ఆలోచించాడు మార్క్సు. ఆయనకు రావలిసిన వారసత్వం వుంది. కానీ, అదెప్పుడు వస్తుందో తెలియదు. అందుకని. దానికి కస్టోడియన్ గా వున్నది వాళ్ళ బాబాయ్ లయన్ ఫిలిప్స్, వున్నాడు. జెన్ని ఒకసారి వెళ్లి వట్టి చేతులతో తిరిగి వచ్చేసింది. సరే! అదెప్పుడో పదేళ్ళ క్రితం జరిగింది. మళ్ళీ ఒకసారి బాబాయ్ ని అడుగుదామని, హాలెండ్ వెళ్ళడానికి సిద్ధపడ్డాడు. అది 1861 ఫిబ్రవరి నెల. అప్పటికి జెన్నీకి మశూచి తగ్గి ఒక నెల అవుతోంది. అక్కడకు వెళ్ళాలంటే, ఇబ్బంది ఏమిటంటే, మార్క్సు కు ఏ దేశ పౌరసత్వమూ లేదు. కాబట్టి  పాస్ పోర్ట్ లేదు. ఎవరి సహాయమో తీసుకొని" కార్ల్ జాన్ బుహింగ్ "అనే మారుపేరు తోటి పాస్ పోర్ట్ సంపాదించి హాలెండ్ బయలుదేరాడు.ఈ ఫిలిప్స్ అంత దయ గుణం వున్నవాడేమీ కాదు. మార్క్సు పదేపదే అభ్యర్థించిన మీదట ఆయన ఒక 160 పౌండ్లు విదిలించాడు.

"ఇవన్నీ కూడా నీకు అప్పు ఇస్తున్నట్టే.తరువాత మీ అమ్మ డబ్బులు వస్తే, అందులో మినహాయించుకుంటాను." అని ఆ డబ్బు ఇచ్చాడు. సరే! హాలెండ్ వరకూ వచ్చాం కదా! ఒకసారి జర్మనీ కూడా వెళ్దాం. చాలా సంవత్సరాలు అయింది. అనుకొని జర్మనీ లోని 'బెర్లిన్' వెళ్ళాడు. కొంత మంది పాత మిత్రులను కలుసుకున్నాడు. అలాగే ఆయన రాస్తున్నటువంటి 'పొలిటికల్ ఎకానమీ' 2 భాగం కూడా ఎవరైనా అచ్చు వేస్తారేమో చూద్దాం అని ప్రయత్నించాడు. మార్క్సు జర్మనీ లో ఉండగానే, కొడుకు జర్మనీ లోనే వున్నాడనే విషయం   అతని తల్లికి తెలిసింది. మార్క్సు కు కబురు చేసింది. "ఒకసారి వచ్చి వెళ్ళరా, అబ్బాయ్!"అని. అప్పటికి తల్లిని చూసి 13 సంవత్సరాలు అయ్యింది. అలా 1861లో తల్లి ని కలుసుకోవడానికి వెళ్ళాడు. అప్పటికి ఆమె వయసు 64 సంవత్సరాలు. అనారోగ్యంగా వున్న తల్లిని డబ్బులు అడగడానికి ఆయనకు మనస్కరించ లేదు. ఆమె ఏదో తనకు తోచిన సహాయం చేసింది.

ఈ రెండు నెలలూ తను లండన్ లో లేని సమయంలో కుటుంబ వ్యవహారాలు ఎంగెల్సు కు అప్పగించాడు. అతనే ఇంటికి కావాల్సిన డబ్బులు పంపిస్తుండేవాడు. మార్క్సు ఇంట్లో లేని సమయంలో దెబ్బ మీద దెబ్బ అన్నట్లుగా ఏం జరిగిందంటే_ _ మార్క్సు ఇంట్లోని పనిమనిషి హెలెన్ కి కాలికి ఇన్ఫెక్షన్ అయి, జ్వరం వచ్చింది. కాలు మీద పెద్ద పుండు లాగ అయిపోయింది. దాంతో దాదాపు కాలు తీసేస్తారేమో అన్నంతగా భయం వేసింది. కానీ, అంత ప్రమాదం ఏమీ జరగకుండా హెలెన్ బయటపడింది. ఇదంతా మార్క్సు లండన్ లో లేని సమయంలో. ఇలాంటివి ఆ కుటుంబానికి అలవాటై పోయాయి. వాటి మధ్యలోనే ఈ 'పొలిటికల్ ఎకానమీ ' రెండవ భాగం ప్రారంభించాడు మార్క్సు.

1862 వచ్చింది. ఆ సంవత్సరం మార్చి లో జరిగిన మరో పరిణామం ఏమిటంటే_ _ అప్పటికి సంవత్సరం ముందు మొదలైన సివిల్ వార్ చాలా తీవ్ర స్థాయికి చేరుకుంది. దాంతోటి, మార్క్సు వ్యాసాలు ప్రచురిస్తున్న అమెరికన్

పత్రిక 'న్యూయార్క్ డైలీ ట్రిబ్యూన్ 'వాళ్ళు, "మాకు యూరప్ నుండి వచ్చే మీ వ్యాసాలు అవసరం లేదు. ఇక్కడ మాకు సివిల్ వార్ తో చాలా క్లిష్టమైన పరిస్థితులు వున్నాయి." అన్నారు. దాదాపుగా పదేళ్లుగా మార్క్స్ కి అంతో ఇంతో ఆదాయం వస్తున్నటు వంటి ఆ పత్రిక తన కాంట్రాక్ట్ ను రద్దు చేసింది. ఇది ఇలా వుంటే, అమెరికాలోని సివిల్ వార్ తాలూకా ప్రభావం, అక్కడ ఎంగెల్స్ ఫ్యాక్టరీ మీద కూడా పడింది. ఎలాగంటే, అమెరికాకి యూరప్ నుండి పత్తి ఎగుమతులు ఆగిపోయాయి. దాంతో, ఎంగెల్స్ ఫ్యాక్టరీ సంక్షోభంలో పడింది. అతనికి లాభాలు తగ్గాయి.

1862 లోనే మరోసారి హాలెండ్ కీ, అక్కడ నుండి తల్లి దగ్గరకు కూడా వెళ్ళాడు డబ్బులు ఏమైనా వస్తాయేమోనని. ఎప్పటిలాగే పెద్దగా ఉపయోగం ఏమీ కనిపించలేదు.

గత్యంతరం లేక 1862 చివరిలో "ఇంగ్లీష్ రైల్వే ఆఫీసు"లో క్లర్క్ ఉద్యోగానికి దరఖాస్తు చేశాడు. ఎప్పుడూ ఆయన వుద్యోగం కోసం ప్రయత్నించలేదు. ఎంతసేపూ 'ప్రపంచ కార్మికుల సమస్యల గురించి, వాళ్లకు తెలియజెప్పాలి. విప్లవం అనేది ఎలా వస్తుందో, శ్రామికులకు చెప్పాలి. దానికి సంబంధించిన పుస్తకాలు రాయాలి' ఇదే యావ. ఆయన విద్యార్థిగా వున్నప్పుడు ప్రయత్నిస్తే ఉద్యోగం రాలేదు. ఇన్ని సంవత్సరాల తర్వాత, ఇన్ని ప్రయత్నాల తర్వాత, ఇన్ని అప్పుల తర్వాత, ఇన్ని మరణాల తర్వాత, తప్పనిసరి పరిస్థితుల్లో ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్నాడు మార్క్స్. అయితే, ఆయన చేతి రాత బాగుండని కారణంగా ఆ క్లర్క్ ఉద్యోగానికి కూడా ఎంపిక కాలేదు.

ఇక్కడ మరో సంగతి. మార్క్స్, ఎంగెల్సూ మంచి మిత్రులు కదా! మార్క్స్ కి అన్ని రకాలుగా ఎంగెల్స్ మద్దతునిస్తుంటాడు కదా! మరి వాళ్ళిద్దరి మధ్యా ఏమైనా పొరపొచ్చాలు వచ్చాయా? అంటే... అలా వచ్చే సంఘటన ఒకటి జరిగింది. అది 1863 మొదట్లో. ఏం జరిగిందంటే... మార్క్స్ కి తన మీద తనకి వున్న నమ్మకం కంటే, ఎంగెల్స్ కి మార్క్స్ మీద నమ్మకం ఎక్కువ. ఎప్పటికైనా ప్రపంచ రాజకీయ సిద్ధాంతగతిని మార్చేటటు వంటి ప్రతిపాదించే శక్తి మార్క్స్ రచనలకు మాత్రమే వుంది ' అని ప్రగాడంగా విశ్వసిస్తూ ఉండేవాడు. అందుకే ఆయనకు ఎన్ని ఇబ్బందుల్లో వున్నా, వీలయినప్పుడల్లా మార్క్స్ కి ఆర్థిక సహాయం చేస్తుండేవాడు. దానికి ప్రతి ఫలంగా ఎంగెల్స్ ఆశించినది ఏమిటంటే...ఏమీలేదు. కాకపోతే, "నువ్వు రాసే పుస్తకం మాత్రం త్వరగా పూర్తి చెయ్యి." అని అడుగుతుండేవాడు. అంత గాఢమైన మిత్రుల మధ్య విభేదం వచ్చి, ఆ బంధం తెగిపోతుందా? అని సందేహించే సందర్భం ఒకటి 1863 జనవరిలో జరిగింది.

ఏం జరిగిందంటే...ఎంగెల్స్ 20 సంవత్సరాలు సహజీవనం చేస్తుండే, 'మేరీ' అనే ఐరిష్ యువతి మరణించింది.ఆ విషయం తెలియజేస్తూ ఎంగెల్స్, మార్క్స్ కి వుత్తరం రాశాడు."మేరీ తనని నమ్ముకుని జీవించిన విధానం,మేరీ లేకపోవడం వలన తన జీవితంలో ఏర్పడిన శూన్యం..." ఇలా...తన తన బాధాకరమైన వివరిస్తూ వుత్తరం రాశాడు. మార్క్స్ దానికి సమాధానం రాస్తూ..మిత్రుడ్ని ఓదార్చాలి కదా! "అయ్యో !అలా జరిగిందా? అని యేవో రెండు ముక్కలు

రాసి, ఆ తరువాత 40 వాక్యాలూ, తన ఆర్థిక ఇబ్బందులూ, తన ఆరోగ్య సమస్యలూ ఇవన్నీ ఏకరువు పెడుతూ ఉత్తరం ముగించాడు. అది అందుకున్న ఎంగెల్సుకి సహజం గానే, బాధనిపించింది. 'అరే!నేను ఇంత విషాదంలో వున్నాను. సానుభూతి చూపించాల్సింది పోయి, ఎప్పుడూ వుండే బాధల గురించే రాశాడు.' అని ఆయన కొంత కాలం,సమాధానం ఇవ్వకుండా ఆలస్యం చేసి,ఆ తరువాత అదే రాశాడు.

అప్పటికి మార్క్సు కి తను చేసిన తప్పు ఏమిటో తెలిసింది. ఎంగెల్సు కి సమాధానం రాస్తూ...''నిజమే, నీ విషాదానికి నేను సరిగ్గా స్పందించలేకపోయాను. నిజానికి నీ వుత్తరం అందుకున్నప్పుడు నా పరిస్థితి ఎలా వుందంటే, అప్పులు ఇచ్చిన వాళ్ళందరూ ఇంటికి వచ్చి, ఇంట్లోని సామాన్లన్నీ తీసుకువెళ్లి పోతామని బెదిరిస్తున్నారు. పిల్లలకు సరైన బట్టలు లేవు. ఫీజులు కట్టలేక, స్కూలుకి పంపించలేదు. జెన్నీ కి మళ్ళీ జ్వరం. మందులు కొనడానికి డబ్బులు లేవు. ఇదీ నా పరిస్థితి. అప్పటి మనస్థితి అలా వుంది. అయినా నీ పరిస్థితిని అర్థం చేసుకోకుండా , నా ఇబ్బందుల్నే రాశాను. నన్ను క్షమించు.''అని వివరిస్తూ వుత్తరం రాశాడు. అప్పుడు ఎంగెల్సు అనుకున్నాడట 'నన్ను నమ్మిన 'మేరీ' ఈ ప్రపంచాన్ని వదలి వెళ్ళిపోయింది. నేను నమ్ముతున్న మార్క్సును మాత్రం పోగొట్టుకోకూడదు' అని. ఆ విధంగా ఇద్దరు మిత్రులూ కూడా పెద్ద మనసులతో వాళ్ళ అపార్థాలను అక్కడే సమసిపోయేలా చేసుకున్నారు.

ఒక పక్క మార్క్సుకు అప్పులు పెరిగిపోతున్నాయి. తీవ్ర స్థాయికి పెరిగిన అప్పులతోటి 'దివాళా' ఒకటే మార్గం అనుకుని ఒక రోజు కుటుంబ సభ్యులందర్నీ సమావేశ పరచి, ఆడపిల్లలిద్దరినీ "మీరిద్దరూ ఎవరింటి కైనా వెళ్లి ట్యూషన్లు చెప్పుకుని బ్రతకండి. నేను దివాళా ప్రకటిస్తాను.దాంతోటి అప్పుల వాళ్ళు మన దగ్గర వున్న సామాన్లు పట్టుకుపోతారు. అంత కన్నా ఏమీ జరగదు. హెలెన్! నువ్వు వేరే ఎవరింటి లోనైనా పని చూసుకో.''అని పనిమనిషి తో చెప్పాడు. జెన్నీ తో "మనిద్దరమూ, చిన్నపిల్లతో కలసి, ఈ నగర పాలక సంస్థ వాళ్ళు నడిపే అనాధ శరణాలయం లాంటిది ఏదో వుంది.అక్కడకు వెళ్ళిపోదాం." అన్నాడు.

ఈ రోజు 'కేపిటల్' లోని సిద్దాంతాలతో, మానవ జాతి చరిత్రలోనే అత్యంత మేధావిగా ప్రశంసించబడుతున్న కార్ల్ మార్క్సు పరిస్థితి ఆ రోజు అంత దయనీయంగా దివాళా అంచుల వరకూ వెళ్ళింది. నిజంగా ఆనాడు అదే జరిగి ఉంటే, కార్ల్ మార్క్సు గురించి ఈనాడు మనం చెప్పుకునేదేమీ వుండదు. కానీ, ఆనాటి పరిస్థితి అంతా మార్క్సు చెప్పకుండానే ఎలాగో ఎంగెల్సు కు తెలిసింది. ఆయన ఒక వంద పౌండ్లు పంపించాడు. మార్క్సు ఆ ఇంట్లో నుండి బయటకు వెళ్ళకుండా, దివాళా ప్రకటించకుండా కాపాడగలిగాడు. దాంతో కింద పడినటు వంటి కెరటం పైకి లేచినట్లయింది.

మళ్ళీ పుస్తకరచన వేగం పెంచాడు. 'ఈ రెండో భాగం అయినా పబ్లిష్ అయితే,దానికి మంచి పేరు వస్తుంది' అని గట్టి నమ్మకం తో వున్నారు మార్క్సు, ఎంగెల్సు.అయితే, కాలం ఇంకా మార్క్సు ని వదల్లేదు.1863 మధ్యకు వచ్చేసరికి, ఆయన సొంత ఆరోగ్యం బాగా దెబ్బతింది. వీపుమీద చిన్నగా మొదలయిన పుళ్ళు, పెద్దగా పెరిగిపోయి, విపరీతమైన

బాధకు గురిచేశాయి. డాక్టర్లు పరిశీలించి రక రకాలైన మందులు ఇచ్చారు. వాళ్ళు చెప్పారు “ఇదంతా నువ్వు సరైన ఆహారం తీసుకోక పోవడం వల్లనే. క్రమపద్ధతి లేనటువంటి జీవన శైలీ, ఈ చుట్టుపక్కల ఉన్నటువంటి పరిస్థితులూ ఇవే దీనికి కారణం. ఈ మందులతో పాటు వేడి కాపడం కూడా పెడుతుండండి.” అని. పెరుగుతున్న పుళ్ళతో, మార్క్స్ కి కూర్చోవడానికీ, పడుకోవడానికీ కూడా దుర్భరంగా వుండేది. మరి వీటన్నిటి వలన రాత పని కూడా కుంటుబడిపోయింది.

అయితే, ఇంత కాలం వేధిస్తూ ఉన్నటువంటి ఇబ్బంది లన్నీ ఒక కొలిక్కి వచ్చి,45 సంవత్సరాల కార్ల్ మార్క్స్ జీవితంలో కాస్త సౌకర్యవంతం గా వుండేటటువంటి సమయం ఆరంభమయ్యింది. అది 1863 నవంబర్లో. కాకపోతే ఇదే నవంబర్ నెలలో జరిగిన ఒక విషాద సంఘటన తర్వాతే, ఆయన సౌకర్యంగా వుండడం జరిగింది. అదేమిటంటే,1863 నవంబర్ 3౦ వ తేది సాయంత్రం 4 గంటలకి మార్క్స్ అమ్మగారు అక్కడ ట్రయర్ లో చనిపోయారని వార్త వచ్చింది. విచిత్రం ఏమిటంటే, అదే మార్క్స్ అమ్మ గారి పెళ్లి రోజు, అదే సమయం కూడా అదే. సరిగ్గా అదే సమయంలో ఆమె చనిపోయింది.

మార్క్స్ తన అనారోగ్యం తోనే బయలుదేరాడు. తండ్రి పోయినపుడు ఎలాగూ దగ్గర లేడు. దాదాపుగా ఈ ఇరవై ఏళ్ళలో రెండు సార్లు మాత్రమే తల్లిని చూడగలిగాడు. ట్రయర్ వెళ్లి, చెయ్యవలసిన కార్యక్రమాలు చేశాడు. రెండు, మూడు వారాలు అక్కడే వున్నాడు. ఊరంతా తిరిగి, తన చిన్నతనాన్ని, జెన్నీ వాళ్ళ ఇంటి దగ్గర్లో వున్న పరిసరాల్నీ, జెన్నీ పరిచయం అయిన ప్రదేశాలనీ గుర్తు చేసుకున్నాడు. జెన్నీకి వుత్తరం రాశాడు “చాలా రోజుల తర్వాత మన వూర్లో తిరుగుతుంటే, నువ్వే గుర్తుకు వస్తున్నావు. నా చిన్నప్పటి రోజులు గుర్తుకు వస్తున్నాయి.”అని.

మార్క్స్ తన తల్లి చనిపోయిన తర్వాత, అతనికి కొంత ఆస్తి వారసత్వంగా వస్తుంది.ఆ ఆర్థిక లావాదేవీలన్నీ బాబాయ్ తో తేల్చుకోవాలి. అందుకని ట్రయర్ నుండి హాలెండ్ లో బాబాయ్ దగ్గరకు వెళ్ళాడు. అక్కడ 2 నెలల పాటు వున్నాడు. తల్లి నుండి మార్క్స్ కి వెయ్యి పౌండ్లు వచ్చింది. ఇప్పుడున్న ఆర్థిక ఇబ్బందుల్లో ఒక్కసారి వెయ్యి పౌండ్లు రావడం అంటే,అది చాలా సంతోషించ దగ్గ విషయం. ఆ వెయ్యి పౌండ్లలో బాబాయ్ కి గతంలో ఇవ్వవలసిన బాకీ 300 పౌండ్లు బాకీ తీర్చి, మిగిలిన ఏడు వందల పౌండ్లతో లండన్ బయలుదేరాడు. 1864 ఫిబ్రవరి 19న లండన్ చేరుకున్నాడు. ఇక్కడ నుండి కొన్ని రోజుల పాటు మార్క్స్ కుటుంబం బాగానే వున్నారు.

**(కొనసాగింపు వచ్చేనెలలో)**

అక్షరీకరణ – వి. వెంకటరావు

2019 నవంబర్ 12 న, ప్రసారమైన ఈ టాక్ షోని ఇక్కడ వినవచ్చు

COMMENTS